

RNI: APTEL/2010/36742

# న్యూస్ వార్
వార్తా పత్రిక

TELANGANA RISING GLOBAL SUMMIT

నల్లగొండ | epaper.news war.com | గురువారం 26, మార్చి 2026 | సంపుటి :16 సంచిక :8 | ఎడిటర్: నటవా కృష్ణారావు | పేజీలు : 4 , వెల.2.00



## గ్యాస్ బుకింగ్‌కు 35 రోజుల విరామం..

### నిజం కాదని ప్రకటించిన కేంద్రం..

పశ్చిమాసియాలోని ఉద్రిక్తతల కారణంగా దేశంలో చమురు, గ్యాస్ కొరతపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా ప్రజలను భయపెట్టేలా రకరకాల వార్తలు ప్రచారం లోకి వస్తున్నాయి. వంట గ్యాస్ రీఫిల్ బుకింగ్ గడువును చమురు కంపెనీలు 35 రోజులకు పెంచినట్టు మంగళవారం వార్తలు హల్‌చల్ చేశాయి.

వార్త 2లో

## శత్రువులు పశ్చాత్తాప పడేవరకూ ప్రతీకార దాడులు ఆగవు



- దేశ సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను కాపాడుకోవడమే మా తొలి ప్రాధాన్యం'
- హోర్ముజ్ జలసంధిలో నెలకొన్న అభద్రతకు ఈ దురాగతాలే ప్రత్యక్ష కారణం
- ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ

వివరాలు 2లో..

ఇరాన్ - ఇజ్రాయెల్, అమెరికా దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించే దిశగా చర్చలు జరుగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్తున్నప్పటికీ.. ఇరాన్ నుంచి వస్తోన్న సందేశాలు మాత్రం ధిక్కార ధోరణిని కనబరుస్తున్నాయి. ఆ రెండు దేశాలు చేసిన దురాక్రమణకు గానూ.. వారు పశ్చాత్తాప పడేంతవరకూ తమ దాడులు కొనసాగిస్తామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ తేల్చిచెప్పారు. తమ మిత్ర దేశం చైనాతో ఫోన్ సంభాషణలో భాగంగా అరాగ్చీ ఈ వ్యాఖ్యలు చేసినట్టు మీడియా కథనాలు వెల్లడించాయి. ఇస్లామిక్ రిపబ్లిక్‌కు చెందిన పౌర, రక్షణ మౌలిక సదుపాయాలే లక్ష్యంగా శత్రు దేశాలు దాడులు చేయడంతోనే టెహ్రాన్‌లో అస్థిరత చోటుచేసుకుందని అరాగ్చీ తెలిపారు.



## పాకిస్థాన్ నౌకను వెనక్కి పంపించిన ఇరాన్..

పశ్చిమాసియాలోని ఉద్రిక్తతల నేపథ్యంలో హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేసిన సంగతి తెలిసిందే. హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణించే నౌకలు ఏవైనా తమ నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాలని ఇరాన్ షరతులు విధించింది.

వార్త 2లో

## పెట్రోల్, డీజిల్ కొరత లేదు.. భయపడకండి



- అవసరానికి సరిపడా నిల్వలు
- రెండు నెలలకు సరిపడా పెట్రోల్, డీజిల్ స్టాక్
- ప్రభుత్వం సరఫరా వ్యవస్థను పర్యవేక్షిస్తోంది
- ప్రజలు రూమర్స్, ఫేక్ న్యూస్‌ను నమ్మవద్దు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందనే వార్తల నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజలకు భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఇంధన కొరత లేదని, అవసరానికి సరిపడా నిల్వలు ఉన్నాయని తెలిపారు. రెండు నెలలకు సరిపడా పెట్రోల్, డీజిల్ స్టాక్ రాష్ట్రంలో ఉందని మంత్రి వెల్లడించారు.

వార్త 2లో

## ఆ ఇళ్లను కొత్త వారికి ఇస్తాం

- గత ప్రభుత్వాలు చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష
- ఇందిరమ్మ ఇల్లు' పథకం ద్వారా భారీ స్థాయిలో ఇళ్ల నిర్మాణం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



శాసనసభ సమావేశాల్లో గృహ నిర్మాణంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వాలు చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష చేపట్టి, పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయడమే ప్రస్తుత ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం 'ఇందిరమ్మ ఇల్లు' పథకం ద్వారా భారీ స్థాయిలో ఇళ్ల నిర్మాణం చేపట్టిందని మంత్రి గుర్తుచేశారు.

వార్త 2లో



## కాంగ్రెస్ పార్టీకి షాక్.. ప్రధాన కార్యాలయం ఖాళీ చేయాలంటూ నోటీసు

వార్త 2లో

## పొత్తు పెట్టుకుంటే తప్పేంటి: ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**హైదరాబాద్:** బీఆర్ఎస్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మీడియాతో చిట్‌చాట్‌లో భాగంగా పలు రాజకీయ అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. డీలిమిటేషన్ జరిగితే గ్రేటర్ హైదరాబాద్‌లో అసెంబ్లీ సీట్ల సంఖ్య పెరిగే అవకాశముందని ఆయన పేర్కొన్నారు. టీడీపీ పార్టీ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఏర్పడినప్పటికీ, ప్రస్తుతం అదే కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవడం రాజకీయాల్లో సాధారణమైందని సుధీర్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ఇతర పార్టీలతో పొత్తు పెట్టుకుంటే తప్పేమిటని ప్రశ్నించారు. అలాగే, సర్ నిర్వహించడం మంచిదేనని ఆయన అభిప్రాయపడ్డారు. ఓటర్ల జాబితాను సమగ్రంగా నవీకరించడం అవసరమని చెప్పారు. హైదరాబాద్ నగరంలో ఓటింగ్ శాతం తగ్గిపోవడంపై కూడా ఆయన స్పందించారు. ఐదేళ్ల పాటు నగరంలో నివసించే ఓటర్లు, ఓటింగ్ రోజు తమ స్వగ్రామాలకు వెళ్లడం వల్ల గ్రేటర్‌లో పోలింగ్ శాతం తగ్గుతోందని ఆయన తెలిపారు.

2



## బినామీల పేర్లతో ఆస్తులు కూడబెట్టాడు: ఎమ్మెల్యే పల్లా

2



## ఏడుగురు ఎమ్మెల్యేలతోపాటు స్పీకర్‌కు నోటీసులు

# శత్రువులు పశ్చాత్తాప పడేవరకూ ప్రతీకార దాడులు ఆగవు: ఇరాన్

### దేశ సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను కాపాడుకోవడమే మా తొలి ప్రాధాన్యం'

### హోర్ముజ్ జలసంధిలో నెలకొన్న అభద్రతకు ఈ దురాగతాలే ప్రత్యక్ష కారణం

### ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ

ఇంటర్నెట్‌డెస్క్: న్యూస్‌వార్ ప్రతినిధి

ఇరాన్ – ఇజ్రాయెల్, అమెరికా దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించే దిశగా చర్చలు జరుగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్తున్నప్పటికీ.. ఇరాన్ నుంచి వస్తోన్న సందేశాలు మాత్రం ధిక్కార ధోరణిని కనబరుస్తున్నాయి. ఆ రెండు దేశాలు చేసిన దురాక్రమణకు గానూ.. వారు పశ్చాత్తాప పడేంతవరకూ తమ దాడులు కొనసాగిస్తామని ఇరాన్



విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ తేల్చిచెప్పారు. తమ మిత్ర దేశం చైనాతో ఫోన్ సంభాషణలో భాగంగా అరాగ్చీ ఈ వ్యాఖ్యలు చేసినట్టు మీడియా కథనాలు వెల్లడించాయి. ఇస్లామిక్ రిపబ్లిక్‌కు చెందిన పౌర, రక్షణ మౌలిక సదుపాయాలే లక్ష్యంగా శత్రు దేశాలు దాడులు చేయడంతోనే టెహ్రాన్‌లో అస్థిరత చోటుచేసుకుందని అరాగ్చీ తెలిపారు. 'మా లక్ష్యాలన్నీ నెరవేరడం సహా హింసాత్మక దురాక్రమణకు పాల్పడిన శత్రు దేశాలు పశ్చాత్తాప పడేవరకూ ప్రతీకార దాడులు కొనసాగుతాయి. దేశ సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను కాపాడుకోవడమే మా తొలి ప్రాధాన్యం' అని ఇరాన్ విదేశాంగ మంత్రి చెప్పారు. హోర్ముజ్ జలసంధిలో నెలకొన్న అభద్రతకు ఈ దురాగతాలే ప్రత్యక్ష కారణమని ఆయన అన్నారు. అందులో భాగంగానే హోర్ముజ్ జలసంధిని మూసివేశామని.. తాము తీసుకున్న చర్యలన్నీ అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగానే ఉన్నాయని వివరించారు. మరోవైపు.. ఇరాన్‌తో దౌత్యపరమైన చర్చలకు అమెరికా సంకేతాలిస్తుండగా.. టెల్ అవీవ్‌లోని ఇజ్రాయెల్ గూఢచర్య కేంద్రాలే లక్ష్యంగా వరుస దాడులు ప్రారంభించినట్టు ఐఆర్‌జీసీ తెలిపింది. ఇరాన్‌లో ప్రముఖ వ్యక్తులతో తమ చర్చలు కొనసాగుతున్నాయని, ఇది పాలనాపరమైన మార్పునకు సంకేతమని యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ పేర్కొన్న తరుణంలోనే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.

# గ్యాస్ బుకింగ్‌కు 35 రోజుల విరామం..

### నిజం కాదని ప్రకటించిన కేంద్రం..

హైదరాబాద్, (న్యూస్‌వార్ ప్రతినిధి

పశ్చిమాసియాలోని ఉద్రిక్తతల కారణంగా దేశంలో చమురు, గ్యాస్ కొరతపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా ప్రజలను భయపెట్టేలా రకరకాల వార్తలు ప్రచారంలోకి వస్తున్నాయి. వంట గ్యాస్ రీఫిల్ బుకింగ్ గడువును చమురు కంపెనీలు 35 రోజులకు పెంచినట్టు మంగళవారం వార్తలు హల్‌చల్ చేశాయి. ఆ వార్తలపై తాజాగా కేంద్ర ప్రభుత్వం స్పందించింది.ఎల్పీజీ బుకింగ్ సమయాల్లో ఎలాంటి మార్పులూ లేవని కేంద్రం పెట్రోలియం శాఖ బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. 'గ్యాస్ రీఫిల్ బుకింగ్ గడువు పెంపుపై సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు నిజం కాదు. గ్యాస్ బుకింగ్ సమయాల్లో ఎలాంటి మార్పులూ లేవు. కనెక్షన్‌తో సంబంధం లేకుండా పట్టణ ప్రాంతాల్లో రీఫిల్ బుకింగ్‌కు 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల గడువు ఎప్పటిలాగానే కొనసాగుతుంది' అని కేంద్రం ఓ ప్రకటన విడుదల చేసింది.గ్యాస్ బుకింగ్ విషయంలో ఆందోళనలు వద్దని, అలాగే అవసరం లేకపోయినా బుకింగ్‌లు చేయవద్దని ప్రజలకు కేంద్రం సూచించింది. రెండు సిలిండర్లు ఉంటే గ్యాస్ బుకింగ్ మధ్య అంతరాయాన్ని 35 రోజులకు పెంచినట్టు మంగళవారం నుంచి వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. ఆ వార్తలన్నీ అబద్ధాలని కేంద్రం ప్రకటనతో తాజాగా తేలింది.

# పాకిస్థాన్ నౌకను వెనక్కి పంపించిన ఇరాన్..

### హోర్ముజ్ గుండా ప్రయాణానికి అనుమతి నిరాకరణ..

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

పశ్చిమాసియాలోని ఉద్రిక్తతల నేపథ్యంలో హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేసిన సంగతి తెలిసిందే. హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణించే నౌకలు ఏవైనా తమ నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాలని ఇరాన్ షరతులు విధించింది. ముందస్తు అనుమతులు లేని నౌకలను హోర్ముజ్ గుండా ప్రయాణించడానికి అనుమతించేది లేదని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా పాకిస్థాన్‌కు చెందిన కంటైనర్ నౌకను ఇరాన్ వెనక్కి పంపించినట్టు ఐఆర్‌జీసీ వెల్లడించింది.హోర్ముజ్ గుండా ప్రయాణించడానికి ముందుస్తు అనుమతులు లేకపోవడంతో కరాచీ వెళ్తున్న కంటైనర్ నౌకను ఐఆర్‌జీసీ వెనక్కి పంపంచిందిల). ఈ విషయాన్ని పాకిస్థాన్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం కూడా ధ్రువీకరించింది. హోర్ముజ్ గుండా ప్రయాణించే ప్రతి నౌక, ఇస్లామిక్ రిపబ్లిక్ ఇరాన్ సముద్ర యంత్రాంగంతో సమన్వయం చేసుకోవాలని, లేకపోతే తాము జోక్యం చేసుకోవాల్సి ఉంటుందని ఐఆర్‌జీసీ స్పష్టం చేసింది.శత్రు దేశాలకు చెందినవి తప్ప మిగిలిన నౌకలన్నీ హోర్ముజ్ గుండా ప్రయాణించవచ్చని ఇరాన్ ఇప్పటికే ప్రకటించింది . అయితే తమ నుంచి ముందస్తు అనుమతులు మాత్రం తీసుకోవాలని తేల్చి చెప్పింది. కాగా, ఇరాన్–అమెరికా మధ్య శాంతి చర్చలు పాక్ వేదికగా జరగబోతున్నాయని, ఇస్లామాబాద్‌లో ఇరు దేశాల నేతలు పాల్గొంటారని వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే.

# కాంగ్రెస్ పార్టీకి షాక్.. ప్రధాన కార్యాలయం ఖాళీ చేయాలంటూ నోటీసు

న్యూఢిల్లీ: న్యూస్‌వార్ ప్రతినిధి

దేశ రాజధానిలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయానికి అధికారులు నోటీసు అందించారు. ల్యుటియన్స్ జోన్ ఖాళీ చేయాలని అక్బర్ రోడ్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయానికి ఎగ్జిట్ నోటీసు( ఇచ్చారు. అలాగే 5వ నెంబర్ రైసినా రోడ్‌లోని యూత్ కాంగ్రెస్ ఆఫీస్‌ని కూడా ఖాళీ చేయాలని ఆదేశించారు. మార్చి 28లోపు రెండు ప్రాంగణాలను ఖాళీ చేయాలని డెడ్‌లైన్ విధించారు అధికారులు. కాగా, 1978 నుంచి అంటే దాదాపు 48 ఏళ్ల నుంచి అక్బర్ రోడ్‌లోని ప్రధాన కార్యాలయం కేంద్రంగా పార్టీ కార్యకలాపాలను కాంగ్రెస్ నిర్వహిస్తోంది. అయితే, బలవంతపు తొలగింపును అడ్డుకునేందుకు న్యాయపరమైన మార్గాలను పరిశీంచి కోర్టును ఆశ్రయించనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. మరోవైపు, గతేడాది కోట్లా మార్గ్‌లో తమ కొత్త ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్‌ను కాంగ్రెస్ పార్టీ ప్రారంభించింది. అయినప్పటికీ అక్బర్ రోడ్ ప్రాంగణాన్ని ఇంకా ఖాళీ చేయలేదు. పార్టీ కార్యకలాపాలు అక్కడే కొనసాగుతున్నాయి. అక్బర్ రోడ్ కార్యాలయంతో తమకు ఎంతో భావోద్వేగ బంధం ఉందని పలువురు పార్టీ సీనియర్లు చెబుతున్నారు.

### చారిత్రక ప్రాధాన్యం..

ఈ భవనానికి చరిత్రలో అత్యంత ప్రాముఖ్యత ఉంది. ఒకప్పుడు బ్రిటిష్ పాలనలో వైస్రాయ్ లార్డ్ లిన్లిత్‌గో కార్యనిర్వాహక మండలి సభ్యుడైన సర్ రెజినాల్డ్ మాక్స్‌వెల్ ఇక్కడే నివసించారు. 1960ల ప్రారంభంలో భారతదేశంలో మయన్మార్ రాయబారి అయిన డా.ఖిన్ కీ నివాసంగా ఉండేది. ఆ తర్వాత నోబెల్ శాంతి బహుమతిని గెలుచుకున్న డా.ఖిన్ కీ కుమార్తె ఆంగ్ సాన్ సూకీ చాలా సంవత్సరాలు అక్కడే నివాసం ఉన్నారు.1977 ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయం చెందింది. దీంతో పార్టీ చీలిపోయే పలిస్థితులు వచ్చాయి. ఇందిరాగాంధీ వర్గానికి పార్టీ కార్యకలాపాలు నిర్వహించేందుకు ఓ భవనం కావాల్సి వచ్చింది. ఇందిరా గాంధీకి విధేయుడైన అప్పటి రాజ్యసభ ఎంపీ జి.వెంకటస్వామి అక్బర్ రోడ్‌లోని తన బంగ్లాను ఇచ్చారు. ఇక, అప్పటి నుంచి కాంగ్రెస్ తరఫున ప్రధానమంత్రులైన రాజీవ్ గాంధీ, పి.వి.నరసింహారావు, మన్మోహన్ సింగ్ సహా అందరూ దీన్ని ప్రధాన కార్యాలయంగా కొనసాగించారు.

# పెట్రోల్, డీజిల్ కొరత లేదు.. భయపడకండి

### అవసరానికి సరిపడా నిల్వలు

### రెండు నెలలకు సరిపడా పెట్రోల్, డీజిల్ స్టాక్

### ప్రభుత్వం సరఫరా వ్యవస్థను పర్యవేక్షిస్తోంది

### ప్రజలు రూమర్స్, ఫేక్ న్యూస్‌ను నమ్మవద్దు

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్:

రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందనే వార్తల నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజలకు భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఇంధన కొరత లేదని, అవసరానికి సరిపడా నిల్వలు ఉన్నాయని తెలిపారు. రెండు నెలలకు సరిపడా పెట్రోల్, డీజిల్ స్టాక్ రాష్ట్రంలో ఉందని మంత్రి వెల్లడించారు. ప్రభుత్వం సరఫరా వ్యవస్థను పర్యవేక్షిస్తోందని, అవసరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. సివిల్ సప్లై శాఖ మొత్తం పరిస్థితిని నిశితంగా గమనిస్తోందని తెలిపారు. ప్రజలు రూమర్స్, ఫేక్ న్యూస్‌ను నమ్మవద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. అవసరానికి మించి ఇంధనాన్ని నిల్వ చేసుకోవడం ప్రమాదకరమని హెచ్చరించారు. ముఖ్యంగా డ్రమ్స్, కంటైనర్లలో పెద్ద ఎత్తున ఇంధనం నిల్వ చేయడం చట్ట విరుద్ధమని, అలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇక, సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీందర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇంధన డిమాండ్ సుమారు 25 శాతం పెరిగిందని తెలిపారు. ప్రస్తుతం రోజుకు సుమారు 1200 ట్యాంకర్ల ద్వారా సరఫరా జరుగుతోందని చెప్పారు. పెట్రోల్ బంక్‌లు అనవసరంగా మూసివేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# బినామీల పేర్లతో ఆస్తులు కూడబెట్టాడు: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

హైదరాబాద్: న్యూస్‌వార్ ప్రతినిధి

అసెంబ్లీ లాబీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మీడియాతో చిట్‌చాట్‌లో భాగంగా కడియం శ్రీహరిపై తీవ్ర విమర్శలు చేశారు. దేవాదుల ప్రాజెక్టు సృష్టికర్త తానేనని కడియం చెప్పుకోవడం సరైంది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. 2004 నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో దేవాదుల ప్రాజెక్టు కోసం కడియం శ్రీహరి ఎలాంటి పాత్ర పోషించలేదని పల్లా ఆరోపించారు. అలాంటి పరిస్థితుల్లో ఇప్పుడు తానే సృష్టికర్తనని చెప్పుకోవడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు.అలాగే కడియం శ్రీహరికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో అవకాశాలు ఇచ్చారని తెలిపారు. ఎంపీ, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే వంటి కీలక పదవులతో పాటు ఆయన కుటుంబ సభ్యులకు కూడా రాజకీయ అవకాశాలు కల్పించారని గుర్తుచేశారు. కడియం శ్రీహరి బినామీ పేర్లతో ఆస్తులు కూడబెట్టారని పల్లా రాజేశ్వరరెడ్డి ఆరోపించారు. ఆయన నిజాయితీ గల నాయకుడు కాదని తీవ్రంగా విమర్శించారు. ఇక డీలిమిటేషన్ జరిగినా జనగామ ప్రజలకు సేవ చేయడం కొనసాగిస్తానని పల్లా రాజేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఆ ఇళ్లను కొత్త వారికి ఇస్తాం

### గత ప్రభుత్వాలు చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష

### ఇందిరమ్మ ఇల్లు' పథకం ద్వారా భారీ స్థాయిలో ఇళ్ల నిర్మాణం

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్:

శాసనసభ సమావేశాల్లో గృహ నిర్మాణంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వాలు చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష చేపట్టి, పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయడమే ప్రస్తుత ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం 'ఇందిరమ్మ ఇల్లు' పథకం ద్వారా భారీ స్థాయిలో ఇళ్ల నిర్మాణం చేపట్టిందని మంత్రి గుర్తుచేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో 21 లక్షల ఇళ్లు నిర్మించారని తెలిపారు. అనంతరం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష ఇళ్లకు అనుమతులు ఇచ్చిందని చెప్పారు. అయితే, ఆ ఇళ్లలో అనేక పనులు పూర్తి కాలేదని మంత్రి వెల్లడించారు. సుమారు 70 వేల ఇళ్లలో చిన్నపాటి పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, మరో 26 వేల ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయని తెలిపారు. ఈ అసంపూర్తి పనులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసిందని చెప్పారు.ఇక గత ప్రభుత్వం కేటాయించిన ఇళ్లలో 12 వేల ఇళ్లను ఇప్పటికీ లబ్ధిదారులు ఆక్యూపై చేయలేదని మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులకు మూడు నెలల గడువు ఇచ్చి నోటీసులు జారీ చేయగా, అందులో 6 వేల మంది ఇళ్లను ఆక్యూపై చేసుకున్నారని చెప్పారు. మిగిలిన ఇళ్లను అర్హులైన కొత్త లబ్ధిదారులకు కేటాయిస్తామని స్పష్టం చేశారు. అలాగే, పూర్తి కాకుండా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఎంత ఖర్చు అయినా పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఇప్పటివరకు ఎవరికీ కేటాయించని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కూడా త్వరలో లబ్ధిదారులకు అందజేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల అంశంపై అన్ని పార్టీల ప్రజాప్రతినిధులతో కలిసి త్వరలో హైదరాబాద్‌లో సమీక్ష సమావేశం నిర్వహిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.

# ఏడుగురు ఎమ్మెల్యేలతోపాటు స్పీకర్‌కు నోటీసులు

హైదరాబాద్,

పార్టీ మారలేదన్న ఏడుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు తెలంగాణ హైకోర్టు బుధవారం నోటీసులు జారీ చేసింది. అలాగే తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌కు సైతం కోర్టు నోటీసులు ఇచ్చింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని ఇటీవల అసెంబ్లీ స్పీకర్ తీర్పు ఇచ్చారు. ఈ నేపథ్యంలో స్పీకర్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హైకోర్టును ఆశ్రయించారు.ఈ అంశంపై ఈ రోజు విచారణ జరిగింది. దాంతో కౌంటర్ దాఖలు చేయాలంటూ ఎమ్మెల్యేలతోపాటు స్పీకర్‌కు కోర్టు నోటీసులు జారీ చేసింది. నోటీసులు జారీ చేసిన జాబితాలో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, అరికెపూడి గాంధీ, కాలే యాదయ్య, ప్రకాష్ గౌడ్, పోచారం శ్రీనివాసరెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, తెల్లం వెంకట్ రావు ఉన్నారు. ఏప్రిల్ 16వ తేదీ ఈ కేసు విచారణను వాయిదా వేసింది.

### హైకోర్టులో బీఆర్ఎస్ పిటిషన్..

బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారని హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో పిటిషనర్లు స్పష్టం చేశారు. వారంతా బహిరంగంగానే కాంగ్రెస్ కండువా కప్పుకొని ఆ పార్టీ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్నారని హైకోర్టు దృష్టికి తీసుకెళ్లిన పిటిషనర్ల తరఫు న్యాయవాది. అన్ని మీడియాల్లోనూ వీరు కండువా కప్పుకున్న దృశ్యాలు వచ్చాయని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టు చెబితేనే స్పీకర్ స్పందిస్తున్నారని పిటిషనర్ తరఫు న్యాయవాది వివరించారు.పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరితే.. ఏడాది పాటు ఎలాంటి చర్య తీసుకోలేదని తెలిపారు.

# రష్యా నుంచి భారత్‌కు 60 మిలియన్ బ్యారెళ్ల చమురు... వచ్చే నెలలో డెలివరీ




హైదరాబాద్: న్యూస్‌వార్ ప్రతినిధి

భారత చమురు సంస్థలు రష్యా నుంచి సుమారు 60 మిలియన్ బ్యారెళ్ల చమురును కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో మన దేశంలో ఇంధన సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా రష్యా నుంచి చమరును కొనుగోలు చేస్తోంది. ఇది వచ్చే నెలలో డెలివరీ కానున్నట్లు బ్లూమ్‌బర్గ్‌లో కథనం వచ్చింది.బ్రెంట్ క్రూడ్ ధర కంటే బ్యారెల్‌కు 5 నుంచి 15 డాలర్లు అధికంగా చెల్లించి భారత రిఫైనరీలు ఈ చమురును బుక్ చేసినట్లు ఈ కథనం పేర్కొంది. ఈ మొత్తం ఫిబ్రవరిలో చేసిన చమురు కొనుగోళ్ల కంటే రెట్టింపు అని వెల్లడించింది. రష్యా చమురుపై ఉన్న ఆంక్షలను ఇటీవల అమెరికా ఎత్తివేసింది. ఈ నేపథ్యంలో తాజా కొనుగోళ్లు జరిగాయి.పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నంత కాలం రష్యా చమురుపై ఆంక్షల మినహాయింపును అమెరికా పొడిగించే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. రష్యా నుంచి ఈ చమురు కొనుగోలుకు సంబంధించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇరాన్ చమురుపై ఉన్న ఆంక్షలను కూడా అమెరికా ఎత్తివేయడంతో, ఆ దేశ చమురును కూడా భారత రిఫైనరీలు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది.

# 'వందేమాతరం' పాడటం తప్పనిసరి కాదు: సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు


ప్రభుత్వ, అధికారిక కార్యక్రమాల్లో జాతీయ గేయం 'వందేమాతరం' పాడాలంటూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఆ సర్క్యులర్ కేవలం సలహా పూర్వకమైనదే తప్ప, తప్పనిసరి కాదని స్పష్టం చేసింది. అందులో ఎలాంటి శిక్షార్హమైన చర్యలు పేర్కొననందున, ఈ పిటిషన్‌పై విచారణ తొందరపాటు అవుతుందని అభిప్రాయపడింది.భారత ప్రధాన న్యాయమూర్తి (జజీ×) సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం. పంచోలిలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. ఈ ఏడాది జనవరి 28న కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్ కేవలం సలహా మాత్రమేనని, దాన్ని పాటించకపోతే శిక్షలు ఉంటాయని ఎక్కడా చెప్పలేదని ధర్మాసనం పేర్కొంది. "ఒకవేళ శిక్షార్హమైన చర్యలు తీసుకుంటే లేదా దీన్ని తప్పనిసరి చేస్తే అప్పుడు విచారిస్తాం. ప్రస్తుతానికి ఇందులో అలాంటివేమీ లేవు" అని కోర్టు వ్యాఖ్యానించింది.పిటిషనర్ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే, సర్క్యులర్‌లో శిక్షలు లేకపోయినా ఇది పరోక్ష ఒత్తిడికి దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. వందేమాతరం పాడటానికి లేదా గౌరవ సూచకంగా నిలబడటానికి నిరాకరించే వారు సామాజిక వివక్షను ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆయన వాదించారు. "దేశభక్తిని బలవంతంగా రుద్దలేరు. వ్యక్తిగత అంతరాత్మను కాపాడాల్సిన బాధ్యత రాజ్యాంగంపై ఉంది" అని ఆయన నివేదించారు.అయితే, పిటిషనర్ వ్యక్తం చేస్తున్న ఆందోళనలు ప్రస్తుతానికి ఊహాజనితమేనని ధర్మాసనం అభిప్రాయపడింది. ఒకవేళ ఎవరిపైనైనా శిక్షార్హమైన చర్యలు తీసుకున్నా లేదా వివక్ష చూపినా, అప్పుడు మళ్లీ కోర్టును ఆశ్రయించవచ్చని సూచిస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది. విద్యాసంస్థలు, బహిరంగ సభల్లో వందేమాతరం పాడాలని కేంద్రం సర్క్యులర్‌లో సూచించింది. ఇది కేవలం జాతీయ గేయంపై గౌరవాన్ని పెంపొందించడానికేనని, చట్టబద్ధంగా అమలు చేయాలనే ఉద్దేశం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది.వందేమాతరం స్ఫూర్తి గురించి ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభలో ప్రస్తావించడం గమనార్హం. బంకించంద్ర చటోపాధ్యాయ 1875లో రచించిన ఈ గేయం, స్వాతంత్ర్య పోరాటంలో ప్రజలను ఏకతాటిపై నడిపించిందని కొనియాడారు. రవీంద్రనాథ్ ఠాగూర్ స్వరపరిచిన ఈ గీతాన్ని 1896లో కాంగ్రెస్ సమావేశంలో తొలిసారి ఆలపించారు. 1950లో అప్పటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ దీనికి జాతీయ గేయం హోదా కల్పించారు.

## సంపాదకీయం...

# పిపిపి మెడికల్ కాలేజీలు - ప్రమాదకర విధానం

**రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వైద్య రంగంలో ప్రమాదకర ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య (పిపిపి) విధానానికి తెర లేపింది. గత వైసిపి ప్రభుత్వంలో మంజూరయిన 10 ప్రభుత్వ వైద్య కళాశాలలు వీటికి అనుబంధంగా ఏర్పడే ఆసుపత్రులను ప్రవేట్ సంస్థల ఆధీనంలోకి తీసుకురావాలని నిర్ణయించింది. గత ప్రభుత్వం మీద విమర్శలు గుప్పిస్తూ ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థను ప్రైవేట్ శక్తుల చేతుల్లో పెట్టబోతున్నది. వైసిపి ప్రభుత్వ కాలంలో మంజూరైన 17 వైద్య కళాశాలల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం పిపిపి పద్ధతిలో రూ.8548 కోట్ల నిధులు ఆమోదించగా కేవలం నాలుగేళ్లలో రూ.2225 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టి ఐదు కళాశాలలనే అరకొరగా పూర్తి చేసిందని చంద్రబాబు ప్రభుత్వం విమర్శిస్తున్నది. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే కూటమి ప్రభుత్వం పిపిపి విధానాన్ని వైద్య రంగంలో అమలుకు పూనుకుందని చెబుతూనే ఈ విధానం ఎంతో గొప్పదని, ప్రజలకు చాలా మేలు కలుగుతుందని ప్రచారం చేస్తున్నది. పైపెచ్చు పిపిపి అంటే ప్రైవేటీకరణ కాదని కొత్తగా నిర్మిస్తున్న వైద్య కళాశాలలు, ఆసుపత్రులు అన్నీ ప్రభుత్వ అజమాయిషీలోనే ఉంటాయని, కావాలనే ప్రతిపక్ష పార్టీలు బురద జల్లుతున్నాయని ప్రజలను నమ్మించటానికి ప్రయత్నం చేస్తున్నది. పిపిపి విధానాన్ని రాష్ట్రంలో ప్రజలు, అన్ని పక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. నిరసనలు, ఆందోళనలు సాగుతున్నాయి.**

ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాల్సింది పోయి చాలా దౌర్జన్య పూరితంగా వ్యవహరిస్తున్నది. దేశంలో జాతీయ రహదారులన్నీ పిపిపి పద్ధతిలో ఉన్నాయని, అవి ప్రైవేటు వారి చేతుల్లోకి వెళ్ళలేదు కదా అని ముఖ్యమంత్రి ఏకంగా అడ్డగోలు వాదనలు చేస్తున్నారు. మొత్తం 10 వైద్య కళాశాలలను పిపిపి పద్ధతిలో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టటానికి రాష్ట్ర కూటమి ప్రభుత్వం వేగంగా చర్యలు ప్రారంభించింది. ఒక్కో మెడికల్ కాలేజీలో 150 ఎంబిబిఎస్, 24 పోస్ట్ గ్రాడ్యుయేషన్ సీట్ల ప్రాతిపదికన, 625 పడకల సామర్థ్యంగల ఆసుపత్రి నిర్మాణంతో మొదటి దశగా మార్కాపురం, మదనపల్లె, పులివెందుల, ఆదోని వైద్య కళాశాలలను పిపిపి పద్ధతిలో ఇవ్వటానికి ప్రైవేటు సంస్థలను ఆహ్వానిస్తూ టెండర్ల ప్రకటన కూడా ప్రభుత్వం విడుదల చేసింది. పెనుగొండ, పాలకొల్లు, అమలాపురం, నర్సీపట్నం, బాపట్ల, పార్వతీపురం వైద్య కళాశాలలకు రెండో దశలో టెండర్లను పిలవడానికి ప్రయత్నం చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటించింది. టెండర్లలో పేర్కొన్న ఒప్పంద పత్రాన్ని పరిశీలిస్తే పిపిపి విధానం ఎంత ప్రమాదకరమో, ప్రజావనరులను ఈ ప్రభుత్వం తమకు కావలసిన వారికి ఎలా ధారాదత్తం చేస్తున్నదో అర్థమౌతుంది. ఒప్పంద పత్రంలో ప్రతిపాదిత అంశాలు 1. ఒప్పంద కాలపరిమితి 66 ఏళ్లు 2. ఏడాదికి ఎకరానికి లీజు కింద రూ.100 చొప్పున కాంట్రాక్టర్ ప్రభుత్వానికి చెల్లించాలి. 3. మొత్తం 625 పడకలలో 70 శాతం ఆరోగ్యశ్రీ కార్డు కలిగి ఉన్న వారికి కేటాయించాలి. వీరికి సెలెక్ట్ పేషంట్స్ అని పేరు పెట్టారు. 4. మిగిలిన 30 శాతం బెడ్ లను కమర్షియల్‌గా వినియోగించుకొని కార్పొరేట్ ఫీజులు వసూలు చేసుకోవచ్చు. 5. ఒప్పందం అయిన ఒక ఏడాది కాలంలో 100 ఎంబిబిఎస్ సీట్లతో కాలేజీని ప్రారంభించాలి. 6. మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఆసుపత్రి నిర్మాణం పూర్తయ్యే వరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఐదేళ్ల వరకు లేదా ఆసుపత్రి నిర్మాణం అయిన తరువాత జాతీయ మెడికల్ కౌన్సిల్ నిబంధనల ప్రకారం 80 శాతం పడకలు పేషెంట్లతో నిండేదాకా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ప్రైవేట్ సంస్థ ఆధీనంలో ఉంటుంది. 7. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ప్రైవేట్ సంస్థకు ఇస్తూ ప్రభుత్వం ఒప్పందం చేస్తుంది. 8. సెలెక్ట్ పేషెంట్స్ కేటగిరీలో ఆసుపత్రిలో చేరి (ఇన్ పేషెంట్‌గా) వైద్యం లేదా శస్త్ర చికిత్సలు చేసుకునే వారికి రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ లేదా సిజిహెచ్ లేదా ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన (పిఎంజెఎవై) రేట్లు ప్రకారం కాంట్రాక్టర్లకు ఫీజులు చెల్లిస్తుంది. 9. ప్రతి మూడేళ్లకు ఒకసారి దయాగ్నిస్టిక్ చార్జీల రేట్లు, ఏడేళ్లకోసారి మిగిలిన అన్ని రకాల వైద్య, శస్త్ర చికిత్సల చార్జీలు పెంచుతుంది. 10. ఆరోగ్యశ్రీ కార్డ్ ఉన్న వారికి మాత్రమే ఉచితంగా వైద్యం చేయబడుతుంది. ఈ కేటగిరీలో పేషెంట్లకు శస్త్ర చికిత్సలు చేయాలంటే ముందుగా ప్రభుత్వం అనుమతి మంజూరు చేయాలి. 11. రక్త పరీక్షలు, పాథాలజీ, రేడియోలజీ వంటి పరీక్షలకు చార్జీలు చెల్లించాలి. 12. ఔట్ పేషెంట్ (ఓ.పి) లకు మాత్రమే ఉచితంగా వైద్యం చేస్తారు. 13. జనరిక్ మందులు మాత్రమే ఉచితంగా ఇవ్వాలి. 14. మెడికల్ కాలేజీతో పాటు నర్సింగ్, పారా మెడికల్, ఇతర అనేక రకాల మెడికల్ ట్రైనింగ్ కాలేజీలు కాంట్రాక్టర్ నెలకొల్పుకోవచ్చు. 15. మెడికల్ సీట్ల ఫీజులు ప్రభుత్వం నిర్ణయిస్తుంది. ఈ విధానంతో ప్రభుత్వం అందరికీ ఉచిత వైద్యం అందించాలనే బాధ్యత నుండి వైదొలుగుతున్నది. ప్రస్తుతం ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు అనుబంధంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులు అందిస్తున్న సేవలకు భిన్నంగా ఇవి ఉంటాయి. ప్రభుత్వ వైద్య సేవలు పొందటానికి మొదటిసారిగా ప్రభుత్వం ప్రజలను రెండు రకాలుగా విభజిస్తున్నది. ఆరోగ్యశ్రీ కార్డ్ ఉంటేనే ఉచితంగా పరీక్షలు, శస్త్ర



చికిత్సలు, బెడ్ లేదా ఇన్ పేషెంట్ వైద్యం కోసం చేర్చుకుంటారు. ఒకవేళ పేదవాళ్ళయి ఆరోగ్యశ్రీ కార్డు లేక పోతే వారికి ఉచితంగా వైద్యం చేయరు. ప్రభుత్వం సకాలంలో వైద్య బిల్లులు కాంట్రాక్టర్‌కి చెల్లించకపోతే కాంట్రాక్టర్ ఉచిత వైద్యాన్ని నిలిపి వేయొచ్చు. ప్రభుత్వం ఆరోగ్యశ్రీ వైద్య బిల్లులు చెల్లించటం లేదని ప్రైవేట్ కార్పొరేట్ హాస్పిటళ్లు తరచూ ఆరోగ్యశ్రీ కింద వైద్య సేవలు నిలిపివేస్తున్న విషయం తెలిసిందే. ప్రమాదానికి గురై చావు బతుకుల్లో ఉన్న వ్యక్తికి ఎమర్జెన్సీగా వైద్యం చేయరు. ప్రభుత్వం నుండి ఆమోదం వచ్చిన తరువాతే వైద్యం చేస్తారు.

# యుద్ధం ముగింపు కోసం యత్నాలు

### ఇరాన్‌కు 15 డిమాండ్ ముందు పెట్టిన ట్రంప్

### 450 కిలోల యురేనియం అప్పగింత ముఖ్యం

**వాషింగ్టన్,**




పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించేందుకు ఇరాన్‌తో అమెరికా ముమ్మరంగా చర్చలు జరుపుతోంది. ఇందులోభాగంగానే కాల్పుల విరమణ కోసం 15 పాయింట్లతో కూడిన ప్రణాళికను అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌కు పంపినట్లు తెలుస్తోంది. అదే సమయంలో పశ్చిమాసియాకు అదనపు బలగాలను పంపించేందుకు అమెరికా సిద్ధమవుతుండటం గమనార్హం. ఈ శాంతి ప్రణాళికను పాకిస్థాన్ ప్రతినిధుల ద్వారా అమెరికా ఇరాన్ (ఎసజీని)కు పంపించినట్లు సమాచారం. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ న్యూయార్క్ టైమ్స్ కథనం రాసింది. ఈ సీజ్్గ÷ర్ ఎ÷–లాన్ గురించి ఇజ్రాయెల్‌కు అగ్రరాజ్యం ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వలేదని తెలుస్తోంది. అయితే, ఈ కథనాలపై వైట్‌హౌస్ నుంచి స్పందన రాలేదు. యుద్ధం ముగింపు కోసం ఈ ప్రణాళికలో టెహ్రాన్‌కు కొన్ని షరతులు విధించింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలను నిలిపివేసే ప్రయత్నంలో భాగంగా అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఇరాన్‌కు 15 సూత్రాలతో కూడిన వివరణాత్మక కాల్పుల విరమణ ప్రతిపాదనను పంపినట్లు తెలుస్తోంది. పలు అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. ఈ ప్రణాళికను పాకిస్థాన్‌కు చెందిన మధ్యవర్తుల ద్వారా అందించారని తెలుస్తోంది. వాషింగ్టన్, టెహ్రాన్‌ల మధ్య కొత్త చర్చలకు ఆతిథ్యమిచ్చేందుకు కూడా పాకిస్థాన్ ముందుకొచ్చింది. పశ్చిమాసియా ప్రాంతాల్లో ఇప్పటికే మోహరించిన సుమారు 50వేల మంది సిబ్బందికి తోడు మరో వెయ్యి మంది సైనికులను పంపేందుకు యూఎస్ సైన్యం సన్నద్ధమవుతున్న తరుణంలో ఈ దౌత్యపరమైన చర్య చోటుచేసుకుంది. కాల్పుల విరమణ ప్రతిపాదనలతో పాటు 2 మెరైన్ ఎక్స్‌పెడిషనరీ యూనిట్లను కూడా పశ్చిమాసియాకు పంపుతోంది అమెరికా. ఇవి సుమారు 5వేల మంది మెరైన్‌లు సహా వేల మంది సైనికులను తీసుకువస్తాయి. మరోవైపు.. ఇరాన్‌పై తమ సైనిక ఒత్తిడిని కొనసాగించాలని అమెరికాను పట్టుబడుతున్న ఇజ్రాయెల్‌కు అమెరికా చర్యలు తీవ్ర విస్మయానికి గురిచేస్తున్నాయి. ఈ రీతిలో వాషింగ్టన్ కాల్పుల విరమణ ప్రణాళికను ముందుకు తెస్తుందని ఇజ్రాయెల్ ఊహించలేదని మీడియా కథనాలు నివేదిస్తున్నాయి. యుద్ధాన్ని ముగించేందుకు కఠినమైన షరతులను విధిస్తూ ట్రంప్ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. అందులో యురేనియం శుద్ధిని నిలిపివేయడం, హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తిరిగి తెరవడం సహా అమెరికా, ఇజ్రాయెల్ ప్రకటించిన యుద్ధ లక్ష్యాలకు అనుగుణంగా ఉండేలా కీలక చర్యలున్నాయి. ఇరాన్ తన ప్రస్తుత అణు సామర్థ్యాలను విచ్ఛిన్నం చేయయడం. ఇరాన్ ఇకపై ఎప్పటికీ అణ్వాయుధాలను అభివృద్ధి చేయబోమని హామీ ఇవ్వడం. ఇరాన్ భూభాగంలో యురేనియం సుసంపన్నం చేయడానికి అనుమతించక పోవడం. సుమారు 450 కిలోల యురేనియం నిల్వలో 60 శాతాన్ని అంతర్జాతీయ అణుశక్తి సంస్థకు అప్పగించడం. నతాంజ్, ఇస్ఫహాన్, ఫోర్డోలోని అణు కేంద్రాలను కూల్చివేయడం. ఇరాన్ వ్యాప్తంగా ఐఏఈఏకు పూర్తి పారదర్శకత కల్పించడం. ఇరాన్ తన ప్రాంతీయ మధ్యవర్తిత్వ కార్యకలాపాలను నిలిపివేయడం. మిత్రపక్ష మిలీషియాలకు మద్దతును నిలిపివేయడం. హోర్ముజ్ జలసంధిని ప్రపంచవ్యాప్త రవాణాకు తెరిచి ఉంచడం. ఇరాన్ క్షిపణి పరిధిని, పరిమాణాలను పరిమితం చేయడం.

భవిష్యత్తులో క్షిపణి వినియోగం కచ్చితంగా ఆత్మరక్షణకు మాత్రమే వినియోగించడం. పైన పేర్కొన్న పలు కీలక ప్రతిపాదనలతో కూడిన కాల్పుల విరమణ ప్రణాళికను ఇరాన్‌కు అమెరికా పంపినట్టు సమాచారం.

# ఐదు టవర్లుగా సెక్రటేరియట్ ఐకానికి టవర్

### వేగంగా ఐదు టవర్ల నిర్మాణం పనులు

### పనులను పరిశీలించిన మంత్రి నారాయణ



**అమరావతి,**

రాజధాని అమరావతిలో రాష్ట్ర స్థాయి అధికారులంతా ఒకేచోట ఉండేలా సెక్రటేరియట్‌కు ఐకానిక్ టవర్లు డిజైన్ చేశామని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ వెల్లడించారు. ఈ ఐదు టవర్ల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఆయన వివరించారు. అత్యాధునిక డయాగ్రిడ్ టెక్నాలజీతో వీటి నిర్మాణం జరుగుతోందన్నారు. బుధవారం రాజధానిలో నిర్మిస్తున్న హెచ్‌ఓడీ టవర్ –3 కార్నర్ నోడ్ అమర్చే పనులకు మంత్రి నారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గత ఏడాది వర్షాలు అధికంగా కురవడంతో 4 నెలల పాటు ఈ పనులకు ఆటంకం కలిగిందని పేర్కొన్నారు. ఐకానిక్ భవనాలు, ప్రజాప్రతినిధులు, అధికారుల నివాసాలు, మౌలిక వసతుల పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రి నారాయణ వివరించారు. అమరావతి నిర్మాణానికి సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేక్గ÷నాన్స్ మోడల్ ఇచ్చారని చెప్పారు. ప్రజలు చెల్లించే



పన్నుల నుంచి ఒక్క రూపాయి కూడా రాజధాని అమరావతికి ఖర్చు పెట్టడం లేదని పేర్కొన్నారు. అమరావతి సెల్ఫ్గ÷నాన్స్ సిటీ అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కానీ కొంతమంది అమరావతిపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అమరావతిలో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంపై సీఎం చంద్రబాబు సమీక్షించారన్నారు. ప్రస్తుతం ఈ ప్రమాద ఘటనపై విచారణ జరుగుతోందని తెలిపారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ఈ పని చేస్తే.. ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏజీఐసీఎల్ ఎండీ శ్రీనివాస్‌తో పాటు ఇంజనీర్లు పాల్గొన్నారు.

# చంద్రగిరి కోట వద్ద క్షుద్రపూజలు

**తిరుపతి,**

చంద్రగిరి కోట వద్ద క్షుద్రపూజల ఆనవాళ్లతో కలకలం రేగింది. సోమవారం అర్ధరాత్రి కోట పడమర ప్రవేశ ద్వారం వద్ద నడిరోడ్డుపై పసుపు, కుంకుమ, నిమ్మకాయలు పెట్టి వింత ఆకృతులతో ముగ్గులు వేసి ఉన్నారు. కోటకు సెక్యూరిటీ సిబ్బంది ఉండగా నడిరోడ్డుపై పూజలు ఎలా చేశారనే అనుమానం స్థానికుల్లో వ్యక్తమవుతోంది. గతంలో కూడా గుప్తనిధుల కోసం అనేకమంది పూజలు చేసి వుండడంతో ఈ విషయాన్ని పురావస్తుశాఖ అధికారుల దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. పోలీసులు కూడా ఆరా తీస్తున్నారు.

# తేనెటీగల దాడితో పరుగులు

### గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి

**నంద్యాల,**

శ్రీశైలం డ్యామ్ వద్ద తీవ్ర విషాదం నెలకొంది. తేనెటీగల దాడిలో ఓ కానిస్టేబుల్ ప్రాణాలు కోల్పోయారు. పిల్లి వీరస్వామి(52) అనే స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్.. శ్రీశైలం డ్యామ్ వద్ద విధులు నిర్వర్తిస్తున్నారు. విధుల్లో ఉండగా వీరస్వామిపై తేనెటీగలు ఒక్కసారిగా దాడికి పాల్పడ్డాయి. విపరీతంగా కుడుతుండడంతో తప్పించుకునే ప్రయత్నం చేశాడు.. దాడి నుంచి తప్పించుకునే క్రమంలో పరుగులు తీశారు. ఒక్కసారిగా గుండెపోటు రావడంతో మృతిచెందారు. కానిస్టేబుల్ మృతి బాధిత కుటుంబం, డిపార్ట్‌మెంట్‌లో తీరని శోకాన్ని మిగిల్చింది.

# తల్లిని చంపి ఇంట్లోనే పూడ్చిన కూతురు

### పోలీసుల దర్యాప్తులో అంగీకిరించన నిందితురాలు

**హైదరాబాద్,**

నగరంలో దారుణం చోటుచేసుకుంది. ప్రేమ వ్యవహారానికి అడ్డుపడిందని తల్లిని ప్రియుడి సాయంతో కుమార్తె చంపేసింది. ఈ ఘటన నగరంలోని జవహర్‌నగర్ పరిధి కౌకూర్ భరత్‌నగర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 10 నెలల క్రితం అంజు అనే మహిళ అదృశ్యమైంది. దీనిపై జవహర్‌నగర్ పీఎస్‌లో పెద్దకుమార్తె ఫిర్యాదు చేసింది. కుటుంబసభ్యుల ఫోన్‌కాల్స్‌ను పోలీసులు విశ్లేషించడంతో పాటు స్థానికులను విచారించారు. ఈ క్రమంలో తల్లిని చంపినట్లు చిన్న కుమార్తె ఇషిక అంగీకరించింది. ప్రియుడు మౌంటీరాజ్‌తో కలిసి ఈ హత్య చేసినట్లు వెల్లడించింది. ప్రియుడితో సహజీవనంపై తల్లి మందలించడంతో ఆమెను చంపి ఇంట్లోనే పూడ్చిపెట్టినట్లు తెలిపింది. దీంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

కర్నూలులో ఘోర రోడ్డు ప్రమాదం

### ప్రమాదంలో ఒకరు..సహాయక చర్యల వద్ద ఇద్దరు మృతి

**కర్నూలు,**

కర్నూలులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు మృతి చెందారు. తొలుత ఘటన జరిగిన ప్రదేశంలో ఒకరు మృతి చెందగా.. అక్కడ సహాయక చర్యలు కొనసాగుతుండగా జరిగిన మరో ప్రమాదంలో ఇద్దరు చనిపోయారు. నగరంలోని కృష్ణానగర్ వద్ద జాతీయ రహదారి వంతెనపై మంగళవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. తొలుత బైక్‌ను లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న కుమ్మరి శేఖర్ మృతి చెందారు. ఈ క్రమంలో అక్కడ సహాయక చర్యలు కొనసాగిస్తున్న వారిని మరో లారీ ఢీకొట్టింది. దీంతో శరీన్‌నగర్‌కు చెందిన బండారి కన్నాతో పాటు మరో యువకుడు మృతి చెందారు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనాలు సైతం దెబ్బతిన్నాయి. గాయాలపాలైన వారిని నగరంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

న్యూస్ వార్
వార్తా పత్రిక



విశ్వబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కారించాలని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న చండూరు మున్సిపల్ కౌన్సిలర్ కటకం రమేష్ చారి

# చింతపల్లిలో హిందూ సమ్మేళనానికై ఏర్పాట్లు

**న్యూస్ వార్ చింతపల్లి మార్చి 25:**

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రారంభించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా చేపడుతున్న అనేక కార్యక్రమాల్లో భాగంగా భారత దేశమంతట హిందూ సమ్మేళనాలు నిర్వహిస్తున్నది. ఈ సందర్భంగా చింతపల్లి ఉప మండల కేంద్రంలో నిర్వహించే హిందూ సమ్మేళనానికి సంబంధించి జాగరణ టోలిని ఈరోజు విభాగ్ ప్రచారక్ కాసం సత్యనారాయణజీ ఏర్పాటు చేశారు ఈ జాగారణ టోలితో ఉప మండల పరిధిలోని హిందుత్వ అభిమానులందరినీ ఏకం చేసి వారితో ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసి ఈ కమిటీ ద్వారా మండల కేంద్రంలో వైభవోపేతంగా హిందూ సమ్మేళనాన్ని నిర్వహించడానికి యోజన చేశారు. ఈ హిందూ సమ్మేళనం ఆధ్యాత్మికవేత్తల ఉపన్యాసాలతో పాటు అనేక రకాలైన ధార్మిక కార్యక్రమాలతో హిందువులందరిలో సామాజిక సమరసత వెల్లివిరుస్తూ ఆధ్యాత్మిక బంధు భావన పెంపొందించేందుకు దోహదం చేస్తుందని వారు తెలిపారు ఈ సమావేశంలో గోలి కిరణ్,సిద్ధ గౌని సత్యనారాయణ ,శ్రీనివాస్ రెడ్డి ,బొడ్డు మహేష్,ప్రదీప్ ,అభినవ్,ఎ. కృష్ణ,మహేష్ చంద్రశేఖర్,శివ,



పాల్గొన్నారు

# వాలిడేషన్ యాక్ట్ ను రద్దు చేయండి




**న్యూస్ వార్ చౌటుప్పల్ మార్చి 25:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన పెన్షనర్లకు ఆమోదయోగ్యం కానీ వాలిడేషన్ యాక్టును రద్దు చేయాలని కోరుతూ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం చౌటుప్పల ఆధ్వర్యంలో ఈరోజు ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగులు నిరసన దినం పాటించారు. విశ్రాంత ఉద్యోగులలో విభేదాన్ని కలిగిస్తూ 2025 కు పూర్వం రిటైర్డ్ అయిన ఉద్యోగులకు ఒకరకంగా, 2026 తరువాత రిటైర్డ్ అయిన ఉద్యోగులకు మరొక రకంగా కరువుభాత్యాన్ని మరియు పే రివిజన్ కమిషన్లో వ్యత్యాసాన్ని కల్పించడానికి ప్రభుత్వం తిసుకొచ్చిన వాలిడేషన్ యాక్టును ప్రభుత్వము వెంటనే ఉపసంహరించు కోవాలని కోరుతూ విశ్రాంత ఉద్యోగులు. చౌటుప్పల్ ఆర్డీవో కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి బాతరాజు ఆగయ్య, మండల శాఖ అధ్యక్షులు భీమిడి మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కానుగుల వెంకటయ్య, కోశాధికారి బడుగు శ్రీరాములు, మరియు చోల్లేటి రాజయ్య, నారగోని కృష్ణయ్య, బిక్కు నాయక్, మొదలైనవారు పాల్గొన్నారు.

# చౌటుప్పల్ ను అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలి.

**న్యూస్ వార్ చౌటుప్పల్ మార్చి 25:**

దేశవ్యాప్తంగా కొత్త అసెంబ్లీ నియోజకవర్గాలు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్న తరుణంలో చౌటుప్పల్ ను అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలని కోరుతూ చౌటుప్పల్ రెవిన్యూ డివిజనల్ అధికారికి నియోజకవర్గ సాధన సమితి నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చౌటుప్పల్ అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతమని దాదాపు 7 మండలాల ప్రజలు విద్యా, వైద్యం, ఉద్యోగ, వ్యాపారాల నిమిత్తం ఈ చౌటుప్పల్ పైన ఆధారపడి నిత్యం వేల సంఖ్యలో ప్రజలు ఇక్కడికి రాకపోకలు నిర్వహిస్తుంటారని నారాయణపూర్, గట్టుప్పల్, చిట్యాల, రామన్నపేట, వలిగొండ, పోచంపల్లి మండలాలకు కేంద్ర బిందువైన చౌటుప్పల్ ను అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పాటుచేయాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ అసెంబ్లీ నియోజకవర్గ సాధనా సమితి నాయకులు కట్టెల లింగస్వామి, బర్రె రాజు పెరియార్, బోయ కుమార్, దాసరి ప్రకాష్, పంది రాకేష్, చేకూరి బాబు, నేరడి మహేష్, కట్టెల ప్రకాష్, సిరిపంగి చందు, చిత్రాల హరిప్రసాద్, పగిళ్ళ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాల్లోని ప్రజలు భక్తిశ్రద్ధలను అలవర్చుకోవాలి

## ఇరిగేషన్ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి

## ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ కొప్పుల వేనారెడ్డి

**న్యూస్ వార్**

గ్రామాల్లోని ప్రజలు భక్తి భావాన్ని అలవర్చుకోవాలని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేనారెడ్డి అన్నారు బుధవారం మండల పరిధిలోని బుధవారం మండల పరిధిలోని మెగ్య తండా ఆవాస గ్రామం గంగ్లీ తండలో గ్రామానికి చెందిన మాలోత్ సంగ్యా గంసి దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు అందించిన ఐదు గుంటల స్థలంలో దాతల సహకారంతో ఏర్పాటుచేసిన శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన భూమి పూజకు విశిష్ట అతిథులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు గ్రామంలో దేవాలయ నిర్మాణానికి సహకరించిన స్థల దాతలతోపాటు విరాళాన్ని అందించిన దాతలను ఆయన అభినందించారు గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సర్పంచిగా గెలుపొందిన భూక్య రాజు నాయక్ దేవాలయాన్ని నిర్మించడం మంచి పరిణామం అన్నారు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇరిగేషన్ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని గోదావరి జలాలు సూర్యాపేట డివిజన్లోని ఆర్ డి ఆర్ ఎస్సారెస్పీ కాలువల ద్వారా మండలంలోని చివరి భూములకు సరిపడా నీరు అందడం లేదని కేవలం 61 నెంబర్ వరకే రైతులకు నీరు అందుతుందని దీంతో రైతులు తమకు అనేకమంది ఫోన్ చేసి ఆందోళన చెందుతున్నారని ఇది తమ ప్రభుత్వ వైఫల్యం కాదని దీన్ని అధిగమించడం కోసం మూసినదిని ప్రక్షాళన చేసి ప్రణాళిక ప్రకారం రామచంద్రపురం వద్ద మూసి నది జలాలు గోదావరి జలాలను అనుసంధానం చేసి ఎత్తిపోతల ద్వారా ఆత్మకూర్ ఎస్ మండలానికి వరకు చేరవేస్తే అక్కడినుండి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెన్ పహాడ్ మండలంలోని చివరి భూముల వరకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి





చేస్తుందన్నారు ప్రభుత్వాన్ని రైతులు అర్థం చేసుకొని సంయమనం పాటించాలని తెలిపారు తమ తాతలు తండ్రులు వేలాది ఎకరాలను దేవాలయాలకు దార దత్తం చేశారని తాను విద్య వైద్యానికి ఇబ్బంది పడుతున్న వారికి సహకారం అందించేందుకు నూతనంగా ఆలోచన చేపట్టినట్లు సర్వోత్తమ్ రెడ్డి తెలిపారు శంకుస్థాపన భూమి పూజకు విచ్చేసిన నాయకులకు పురోహితులు వజ్రాల సతీష్ శర్మ, చేరాల భాస్కరాచారి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ ఆలయ నిర్మాణానికి మాజీ మార్కెట్ చైర్మన్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి తుమ్మల భుజంగరావు ఆలయంలో ఏర్పాటు చేయనున్న ఆంజనేయ విగ్రహాన్ని అందిస్తానని ప్రకటించగా స్థానిక సర్పంచ్ రాజు నాయక్ 2 లక్షల విరాళం తో పాటు నిర్మాణానికి స్టీల్లు అందిస్తానని హామీ ఇవ్వగా ఉప సర్పంచ్ మాలోత్ వరలక్ష్మి వెంకన్న లక్ష రూపాయలు విరాళాలను ప్రకటించగా పలువురు దాతలు ముందుకొచ్చి వారి విరాళాన్ని ప్రకటించారు ఈ సందర్భంగా ధర్మాపురం నుండి గంగ్లితండ గ్రామానికి రహదారి సరిగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు తెలపడంతో కోటి 90 లక్షలతో రహదారి నిర్మాణం మంజూరు అయిందని నాయకులు తెలిపారు కాగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూముల సురేష్ రావు ఇందుకు వర్షం వ్యక్తం చేసి లింగాల నుండి అన్నారం వరకు, ధూపహాడ్ నుండి చెట్ల ముకుందాపురం వరకు, చీదేళ్ల నుండి మాదారం వరకు, చీదేళ్ల నుండి చెట్ల ముకుందాపురం వరకు, దుబ్బ తండ నుండి ఈదుల వాగు తండ మీదుగా నేలమర్రి,మాదారం వరకు రహ దారులు అధ్వానంగా ఉన్నాయని వాటికి కూడా నిధులు మంజూరు అయ్యేలా చూడాలని నాయకుల దృష్టికి తీసుకొచ్చారు అందుకు స్థానిక మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి కోదాడ శాసనసభ్యులు ఉత్తం పద్మావతి తో మాట్లాడి రోడ్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని సర్వోత్తమ్ రెడ్డి హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ భూక్య రాజు నాయక్, ఉపసర్పంచ్ మాలోతూ వరలక్ష్మి వెంకన్న, సూర్యాపేట కౌన్సిల్ సభ్యులు దిలీప్ రెడ్డి, నాయకులు గుండు వెంకన్న, సుంకర సుజాత, లకావత్ వీరన్న,దస్రు నాయక్, బాలు, నాగేశ్వరరావు, బద్రి, సుందర్, సైదులు, ఫకీరా, లింగయ్య, సిద్దు, శ్రీను, అశోక్, లింగా, వార్డు సభ్యులు నాగు, సాగర్, కళ్యాణ్,మహిళలు,గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు....

# రోబోటిక్ శస్త్రచికిత్స విస్తరణకు క్వాలిటీ కేర్-ఇంట్యూటివ్ ఒప్పందం

ఆధునిక వైద్య సేవలను దేశ వ్యాప్తంగా విస్తరించే దిశగా, ప్రముఖ ఆరోగ్య సేవా సంస్థ క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్, మినిమల్లీ ఇన్వాసివ్ కేర్‌లో ప్రపంచ స్థాయి టెక్నాలజీ సంస్థ ఇంట్యూటివ్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ ఖన్నా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంట్యూటివ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్, జనరల్ మేనేజర్ రోహిత్ మహాజన్ తో కలసి అయన మాట్లాడుతూ ముఖ్యంగా టైర్ 2, టైర్ 3 నగరాల్లోని రోగులకు ఈ అధునాతన చికిత్స అందుబాటులోకి తీసుకు రావడం ప్రధాన లక్ష్యం అన్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా సర్జన్లు వైద్య బృందాలకు శిక్షణ ఇవ్వడంతో పాటు, నిరంతర సాంకేతిక మద్దతు అందించి వారి వైద్య సామర్థ్యాన్ని మరింత పెంచుతుందని తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా కేర్ హాస్పిటల్స్, కిమ్‌హెల్త్, ఎవర్‌కేర్ హాస్పిటల్స్ నెట్‌వర్క్‌లో రోబోటిక్ సహాయంతో చేసే శస్త్రచికిత్స సేవలను దశలవారీగా విస్తరించనున్నారని తెలిపారు.




Edited, Printed, Published & Owned by NATAVA KRISHNA RAO, Published from: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255, Telangana, Printed at: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255,Telangana, Editor:NATAVA KRISHNA RAO, Cell: 9440991979,